
సాక్షి గుంటూరు

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



ముగిసిన చవితి ఉత్సవాలు

విజయవాడ: ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వినాయక చవితి ఉత్సవాలు మూడో రోజైన బుధవారం పూర్ణాహుతితో ముగిశాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 524.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు వదిలారు.



శరవేగంగా 'స్మృతివనం'

విజయవాడ : బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనంలో పనులను బుధవారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పరిశీలించారు. విగ్రహ పనులు శరవేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు.

సర్వే జనా సురక్ష

- ఇక నిశ్చింతగా ఆరోగ్య భద్రత
- జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం
- కొనసాగుతున్న వలంటీర్ల ఇంటింటి సర్వే
- ఏడు రకాల వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎంలు
- ప్రతి ఒక్కరి మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్
- వ్యాధిని బట్టి వైద్యశిబిరంలో లేదా ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం



నందిగామలో జగనన్న ఆరోగ్య సురక్ష యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఏఎన్ఎంలు

సత్తెనపల్లి: పేదలు తమ ఆరోగ్యంపై ఇక బెంగపడన వసరం లేదు. ఆస్పత్రికి వెళ్లాలన్నా.. మందులు కొనాలన్నా నిశ్చింతగా ఉండొచ్చు. ఏ రుగ్మత వచ్చినా యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఆ వివరాలు నమోదు చేస్తే వెంటనే ఏఎన్ఎం ఇంటికే వచ్చి తక్షణ వైద్యసాయం అందేలా చూస్తారు. ఉపశమనం లభించకపోతే వైద్యాధికారి ఇంటి ముంగిటకే వస్తారు. ప్రజల వద్దకు పాలన నినాదంతో ముందు కెళ్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు సంపూర్ణ వైద్య సేవలను ప్రజల ముంగిటకే అందించే ప్రక్రియకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నాంది పలికింది.

జగనన్న సురక్ష తరహాలోనే..

ఇప్పటికే జగనన్న సురక్ష ద్వారా ఇంటి వద్దకే అన్ని రకాల సేవలను తీసుకొచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ఆ తరహాలోనే ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత ఏఎన్ఎంలు, వలంటీర్లు సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఇంటింటి సర్వే చేపడతారు. ఇంటిలో ఉన్న సభ్యుల సంఖ్య, అందరూ ఆరోగ్యంగా ఉన్నారా? లేదా? ఎవరికైనా ఏదైనా రుగ్మతలు ఉన్నాయా? ఉంటే అవి ఏంటి? చికిత్స తీసుకుంటు న్నారా? తదితర వివరాలు సేకరిస్తారు. ఈ సర్వే ద్వారా గుర్తించిన వ్యాధులకు ఆ ప్రాంత పరిసరాల్లోనే ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించి కార్పొరేట్ వైద్యనిపుణుల ద్వారా చికిత్స అందిస్తారు. అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలూ చేయిస్తారు. ఉచితంగా మందులు అందజేస్తారు. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా సాయమూ అందిస్తారు.

ముమ్మరంగా సర్వే

ప్రస్తుతం పల్నాడు జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఏఎన్ఎంలు, వలంటీర్లు జగనన్న ఆరోగ్య సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేసుకుని సర్వే చేస్తున్నారు. ఇంటివద్దే కుటుంబ సభ్యులందరికీ ఏడు రకాల వైద్యపరీక్షలు చేస్తు న్నారు. ఆ కుటుంబంలోని వ్యక్తి సెల్‌ఫోన్‌లో జగనన్న సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేసి సర్వే వివరాలు అందులో అప్‌లోడ్ చేస్తున్నారు.



ఇంటింటి సర్వే చేస్తున్న వలంటీర్లు

యాప్ ఆపద్బాంధవే

జగనన్న ఆరోగ్య సురక్ష యాప్ ఉంటే ఆరోగ్యానికి భరోసా దొరికినట్టేనని అధికారులు చెబుతున్నారు. అర్ధరాత్రిఅపరాత్రి అనే భయం లేకుండా కుటుంబంలో ఎవరికి ఆరోగ్యం బాగాలేకపోయినా ఆ వివరాలు పొందుపరిస్తే వెంటనే దగ్గరలోని ఏఎన్ఎం వచ్చి చికిత్స అందిస్తారు. ఇది రోగులకు ప్రథమ చికిత్సగా ఉపయోగపడుతుంది. దీని వలన అత్యవసరంగా ఆస్పత్రులకు పరిగెత్తాల్సిన అవసరం ఉండదు. కేవలం యాప్ ఉండడంతో ముందుగా ఏఎన్ఎం, తర్వాత రోగి పరిస్థితిని బట్టి వైద్యాధికారి కూడా రోగి చెంతకు వస్తారు.

ఆరోగ్యశ్రీ వివరాలు తెలిపే కరపత్రాల పంపిణీ

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మరో మేలు జరుగుతుంది. ఇప్పటి వరకు ఏ వ్యాధులు ఆరోగ్యశ్రీ పరిధిలోకి వస్తాయి? వాటిని పొందే విధానం ఏమిటి? ఆ సేవలు పొందాలంటే ఏ పేపర్లు తీసుకెళ్లాలి? అత్యవసరంగా వైద్య సాయం పొందే విధానం ఏమిటి? అనే అంశాలు క్షుణ్ణంగా తెలిసేలా కరపత్రాలు ముద్రించి ప్రతి ఇంటికీ పంపిణీ చేస్తున్నారు.

రోగి విశ్రాంతి సమయంలో ఆర్థిక భరోసా

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స పొందిన తర్వాత రోగి విశ్రాంతి తీసుకునే సమయంలో జీవనానికి ఇబ్బంది పడకుండా ఆరోగ్య ఆసరా ద్వారా రోజుకు రూ. 225 చొప్పున నెలకు రూ.5 వేల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది.

న్యూస్‌రీల్

మహిళా రిజర్వేషన్ బిల్లు చారిత్రాత్మకం

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్రం పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టడం చారిత్రాత్మకమని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. జెడ్పీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా గణేశ్ విగ్రహానికి బుధవారం హెనీ క్రిస్టినా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు ప్రవేశపెట్టిన రోజు సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు అని అభివర్ణించారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు పెద్దపీట వేశారని గుర్తుచేశారు. ఆయన ప్రోత్సాహంతోనే తాను ఉమ్మడి గుంటూరు జిల్లాకు ప్రథమ పౌరురాలిగా ఉన్నానని చెప్పారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం



బాపట్ల అర్బన్: కొనుగోలుదారుల అభిమానం పొందినప్పుడే ఏ వ్యాపారంలోనైనా రాణించగలమనే సూత్రాన్ని స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు గుర్తించాలని బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్ చెప్పారు. ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అందులోని ఆహార పదార్థాలను రుచి చూశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఆర్థిక అభ్యున్నతి సాధించేందుకు ఇదొక చక్కని ప్రాజెక్టు అన్నారు. కష్టపడుతూ మరికొందరు మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ (సీఎంఎం) హనుమాన్ నాయక్ ఆహా క్యాంటీన్ నిర్వహణకు మెప్మా రూ.13 వేల చొప్పున మంజూరు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో సీఎంఎం డి.హనుమానాయక్, సీఓపీ విశ్వనాథ్, క్రాంతి, తనుజ, రిసోర్స్‌పర్సన్స్ పాల్గొన్నారు.

24న బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : ఈనెల 24న సబ్ జూనియర్ బాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు స్థానిక ఎన్జీఓ క్లబ్‌లో నిర్వహిస్తామని బ్యాడ్మింటన్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కార్యదర్శి ఇ.శివశంకర్ బుధవారం తెలిపారు. 2008 జనవరి 2 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొ న్నారు. ఎంపిక చేసిన జిల్లా జట్టును ఈ నెల 30 నుంచి వచ్చేనెల 2 వరకు కర్నూలులోని మహానందిలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు పంపిస్తామని చెప్పారు. వివరాలకు 93969 90666 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

యార్డుకు 30,196 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 30,196 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 28,861 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 25,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,318 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 3,800 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 166, బ్యాంక్ కెనాల్‌కు 990, తూర్పు కెనాల్‌కు 280, పశ్చిమ కెనాల్‌కు 147, నిజాంపట్నం కాలువకు 250, కొమ్మమూరు కాల్వకు 990 క్యూసెక్కులు విడుదల చేశారు.



నృత్య నీరాజనం



గుంటూరు నగరంలో గణపతి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపాల వద్ద సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకుంటున్నాయి. బుధవారం శ్రీనగర్ ఏడోలైన్‌కు చెందిన అను డ్యాన్స్ అకాడమీ కళాకారిణులు ఎస్వీఎన్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పందిరిలో గణేశునికి నృత్య నీరాజనం సమర్పించారు. నాట్యగురువు అనుశేఖర్ పర్యవేక్షణలో జరిగిన ప్రదర్శనలోని నాట్యవిన్యాసాలను చిత్రాల్లో తిలకించవచ్చు. - గుంటూరు ఎడ్యుకేషన్

పిల్లలను కాపాడి.. ప్రాణం విడిచే

గుండెనొప్పితో పాఠశాల బస్సు డ్రైవర్ మృతి



సీటులో ప్రాణాలు విడిచిన డ్రైవర్ ఏడుకొండలు, ఇన్‌సెట్‌లో ఏడుకొండలు (ఫైల్)

అద్దంకి: గుండెనొప్పితో తాను చనిపోతానని తెలుసుకున్న డ్రైవర్ నడుపుతున్న బస్సును పక్కకు తీసి ఆపి ప్రాణాలు విడిచిన ఘటన బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని మైలవరం గ్రామ సమీపంలో బుధవారం జరిగింది. అందిన సమాచారం మేరకు అద్దంకి మండలంలోని చక్రాయపాలెం గ్రామానికి చెందిన గుర్రాల ఏడుకొండలు (55) 13 ఏళ్ల నుంచి పట్టణంలోని చైతన్య పాఠశాల బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉప్పలపాడు–మైలవరం రూట్‌లోని పిల్లలను ఎక్కించుకు రావడానికి వెళ్లాడు. పిల్లలను ఎక్కించుకుని వస్తూ అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో బస్సులో ఉన్న పిల్లల ప్రాణాలను రక్షించేందుకు నడుపుతున్న బస్సును పక్కకు తీసి ఆపి తాను ప్రాణాలు విడిచాడు. ఏడుకొండలుకు భార్య, కుమారుడు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై దాడి హేయం

- పెదవడ్లపూడిలో టీడీపీ, జనసేన కార్యకర్తల దాష్టీకం
- గాయపడిన పాలేటి కృష్ణవేణి
- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వైనం



కృష్ణవేణిని పరామర్శిస్తున్న ఝాన్సీ, ప్రసాద్, ఇతర నాయకులు

గుంటూరు ఈస్ట్: వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తపై టీడీపీ, జనసేన కార్యకర్తలు దాడిచేయడం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గనిక ఝాన్సీ ఖండించారు. పెదవడ్లపూడిలో టీడీపీ, జనసేన కార్యకర్తల దాడిలో గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త పాలేటి కృష్ణవేణిని బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు.

ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ టీడీపీలో క్రియాశీల కార్యకర్త అయిన కృష్ణవేణి అక్కడ ఆ పార్టీ కార్యకలాపాలపై విసుగు చెంది వైఎస్సార్ సీపీలో చేరారని, అప్పటి నుంచి టీడీపీ నేతలు సోషల్ మీడియాలో లేనిపోని పోస్టింగ్‌లు పెడుతూ ఆమెను వేధించారని విమర్శించారు. కృష్ణవేణి వాటికి దీటుగా సమాధానలివ్వడంతో బుధవారం గ్రామ టీడీపీ నాయకుడు కృష్ణవేణిని రాజీ కోసం పిలిపించాడని, ఈ సమయంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు కృష్ణవేణిపై దాడిచేశారని, ఇది చాలా హేయమని ఝాన్సీ ధ్వజమెత్తారు. కృష్ణవేణికి ప్రాణభయం ఉందని పేర్కొన్నారు. నారా లోకేష్ టీడీపీ శ్రేణులను రెచ్చగొడుతూ మహిళలపై తప్పుడు పోస్టింగ్‌లు పెట్టిస్తున్నారని విమర్శించారు. కృష్ణవేణికి అన్యాయం జరిగిందని, దాడిచేసిన వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు వేముల ప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుతో టీడీపీ నాయకులు, కార్యకర్తల పిచ్చి తారస్థాయికి చేరిందని ధ్వజమెత్తారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ కృష్ణవేణికి అండగా ఉంటుందన్నారు. పవన్ కళ్యాణ్ కార్యకర్తలను రెచ్చగొట్టి పిచ్చి పనులు చేసేలా ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజా క్షేత్రంలో టీడీపీ, జనసేనకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు క్రాంతికుమార్, మనోరంజని, స్వర్ణలత పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం సహించం

- జాయింట్ కలెక్టర్ రాజకుమారి
- కొల్లిపరలో 'జగనన్నకు చెబుదాం'
- కార్యక్రమానికి విశేష స్పందన



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి. పక్కన తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

కొల్లిపర(తెనాలి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి హెచ్చరించారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల ప్రకారం మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి మండల పరిధిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి జేసీ అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ కొల్లిపర మండల ప్రజలు మొత్తం 78 అర్జీలను అందజేశారు. వీటిని ఆన్‌లైన్‌లో నమోదుచేస్తామని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సహేతుకంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీల్లో ఎక్కువశాతం రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖకు చెందినవని చెప్పారు. పంటపొలాలకు వెళ్లే డొంకరోడ్లు దెబ్బతిన్నందున వర్షాకాలంలో రాకపోకలకు సమస్యగా ఉందని పలువురు రైతులు ఇచ్చిన వినతిపై మాట్లాడుతూ పంచాయతీలకు నిధుల సమస్య ఉన్నందున అన్ని గ్రామాలకూ కలిపి డొంకరోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధంచేస్తే ప్రభుత్వానికి పంపుదామని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు ఇవ్వకపోవటాన్ని పలువురు ప్రస్తావించినట్టు గుర్తుచేశారు. దశలవారీగా బిల్లులు చెల్లించాల్సిందేనని స్పష్టంగా చెప్పారు. అధికారులు కూడా తమ వినతులను పట్టించుకోవటం లేదంటూ ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారని జేసీ వెల్లడించారు.

అధికారులపై అసహనం

కొల్లిపర మండలం నుంచి ప్రభుత్వానికి 235 అర్జీలు వచ్చాయని, వీటిలో ఎక్కువ శాతం అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేయడంపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 235 అర్జీదారులకు ఫోన్లు చేసినప్పుడు కేవలం 96 మంది మాత్రమే ఆన్సర్ చేశారని, మిగిలినవారు ఫోన్ తీయకపోవటానికి కారణమేమిటని, పొరపాటు ఎక్కడ జరిగిందని అధికారులను ప్రశ్నించారు. మండల అధికారుల తీరు సరిగా లేదని అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొందరు వీఆర్‌ఓల తీరు సరికాదని చెబుతూ నెల రోజులు గడువు ఇస్తానని, ఆ తర్వాత మళ్లీ కొల్లిపర మండల సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు. అధికారులు సక్రమంగా పనిచేయాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, డీఈఓ శైలజ, స్టెప్ సీఈఓ పల్లవి, ఉద్యానశాఖ ఏడీ రవీంద్రబాబు, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శ్రావణబాబు, పంచాయతీరాజ్ ఎస్ఈ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బ్రమ్మయ్య, మండల ప్రత్యేక అధికారి కృష్ణారావు, తహసీల్దార్ రవిబాబు, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీపీ భీమవరపు పద్మావతి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ అవుతు సీత పాల్గొన్నారు.

చిట్టీల మోసంపై ఫిర్యాదు

కొల్లిపర మండలం దావులూరుకు చెందిన కొందరు మహిళలు మాట్లాడుతూ గ్రామానికే చెందిన ఒక మహిళ వద్ద చిట్టీలు వేశామని, నగదూ అప్పుగా ఇచ్చి మోసపోయామని జేసీకి ఫిర్యాదు చేశారు. మొత్తం రూ.2.40 కోట్ల మేర మోసపోయినట్టు వెల్లడించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా తగిన స్పందన లేదంటూ చెప్పారు. దీంతో స్పందించిన జేసీ జిల్లా ఎస్పీతో మాట్లాడతానని హామీనిచ్చారు.

వినాయక.. వీడ్కోలిక



జిల్లావ్యాప్తంగా వినాయక నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం మూడోరోజు కావడంతో చాలాచోట్ల విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఊరేగింపులు నిర్వహించారు. తీన్‌మార్ డప్పుచప్పుళ్లు, యువత చిందులతో ప్రదర్శనలు ఉత్సాహంగా సాగాయి. అమరావతి ధ్యానబుద్ధ ఘాట్‌లో క్రేన్ సాయంతో విగ్రహాన్ని నదిలోకి దించుతున్న దృశ్యాన్ని చిత్రంలో చూడొచ్చు. నిమజ్జనోత్సవ ఏర్పాట్లను సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షించారు. - అమరావతి

మేడపి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ఒక మహిళ మృతి
- 30 మందికి తీవ్రగాయాలు



వినుకొండ(నూజెండ్ల) : గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై ప్రకాశం జిల్లా మేడపి వద్ద బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కర్నూలు జిల్లాకు చెందిన మెప్మా సిబ్బంది విజయవాడలో జరిగే సమావేశానికి ప్రైవేటు స్లీపర్ కోచ్ బస్సులో వెళ్తుండగా మార్గ మధ్యంలో ప్రకాశం జిల్లా మేడపి వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. సుమారు 30 మందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరుకు తరలించారు.

శుభరూపాయ నమో..



గణపతి నవరాత్రుల్లో భాగంగా రోజుకో అలంకారంలో విఘ్నేశ్వరుడు భక్తులను కటాక్షిస్తున్నారు. ఆయన దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా తిలకించి భక్తులు పులకిస్తున్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట పాలపాడురోడ్డులోని అపార్ట్‌మెంట్ వద్ద నెలకొల్పిన మండపంలో మూడోరోజు గణనాథుడిని రూ.18 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆ సుమనోహర దృశ్యాన్ని చిత్రంలో చూడొచ్చు. - నరసరావుపేట ఈస్ట్

క్లుప్తంగా

కందిపప్పు ధరల నియంత్రణకు ఇప్పటికే చర్యలు

పల్నాడు జేసీ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: జిల్లాలో కందిపప్పు ధరల నియంత్రణ కోసం జిల్లావ్యాప్తంగా 12 కౌంటర్లను ఏర్పాటుచేసి వినియోగదారులకు బహిరంగ ధరల కంటే తక్కువకే అందజేస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. బుధవారం కందిపప్పు..కిల్లిం వేయరా? అంటూ ఓ దినపత్రిక (సాక్షి కాదు)లో వచ్చిన వార్తపై ఆయన స్పందించి వివరణ ఇచ్చారు. జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరల్ని నియంత్రించేందుకు జూలైలోనే ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రత్యేక కౌంటర్ల ద్వారా దేశవాళీ కందిపప్పు రూ.135, ఆఫ్రికన్ వెరైటీ కందిపప్పు రూ.120కు వినియోగదారులకు అందజేస్తున్నామని పేర్కొన్నారు. మాచర్ల, దుర్గి, కారంపూడి మండలాల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా దేశవాళి పప్పు రూ.120కు విక్రయిస్తున్నామని చెప్పారు. ఆ పత్రిక ప్రచురించిన కథనంలో వాస్తవం లేదని వివరణ ఇచ్చారు.

గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు

- క్రేన్ల సహాయంతో భారీ ప్రతిమల నిమజ్జనం
- అందుబాటులో గజ ఈతగాళ్లు, లైఫ్‌జాకెట్లు, నాటు పడవలు
- జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్



నగరంపాలెం: జిల్లాలో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా కొనసాగే విధంగా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హాఫీజ్ బుధవారం ఒక ప్రకటనలో పోలీస్ అధికారులను ఆదేశించారు. తాడేపల్లి, చేబ్రోలు, తెనాలి, తూళ్లూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని నదీ పరీవాహక ప్రాంతాల్లోని ఘాట్లను, ఇరువైపుల ఉన్న నిమజ్జనం ప్రాంతాలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. నిమజ్జన వేళల్లో ఎటువంటి తప్పిదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నదీలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నట్‌లైతే క్రేన్ల సహాయంతో ప్రతిమలు నిమజ్జనం చేయాలని సూచించారు. ఆయా ఘాట్ల వద్ద పోలీస్ సిబ్బందికి విధులు కేటాయించి, నిమజ్జన ప్రాంతాల్లో నగరపాలక సంస్థ, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక శాఖల సమన్వయంతో పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు, విద్యుత్ వెలుగుల నిర్వహణలో చేపట్టాలని చెప్పారు. అదే విధంగా గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్‌లు, నాటు పడవలు అందుబాటులో ఉండాలని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా ఉంచాలని సూచించారు. నిమజ్జనాలుగా వెళ్లే ఊరేగింపులోని రహదారులు, కూడళ్ల వద్ద పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా క్రమబద్ధీకరించాలని అన్నారు.

పలువురు వైద్యులకు ఉద్యోగోన్నతి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న పలువురు వైద్యులకు అడిషనల్ డీఎంఈగా ప్రమోషన్ లభించింది. ఈమేరకు బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జీజీహెచ్ పిల్లల వైద్య విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ టి.పద్మలతకు అడిషనల్ డీఎంఈగా ప్రమోషన్ ఇచ్చి పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ పి.అశోక్‌కుమార్‌ను విశాఖపట్నం కింగ్‌జార్జ్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.సుధాకర్‌ను విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారీని రాజమండ్రి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాల ఈఎన్‌టీ ప్రొఫెసర్ కె.జీవన్‌ప్రదీప్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలు, టీచింగ్ ఆసుపత్రుల్లో ప్రమోషన్‌ల ద్వారా పోస్టులు భర్తీ చేయడంతో వైద్యుల సంఘం నేతలు హర్షం వ్యక్తం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.


శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు సైన్స్ సెమినార్లు దోహదం

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనలు, సృజనాత్మకత పెరిగి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు సైన్స్ సెమినార్లు దోహదపడతాయని జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏ.ఏ.మధుకుమార్ తెలిపారు. నేషనల్ సైన్స్ సెమినార్‌లో భాగంగా బుధవారం మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో చిరుధాన్యాలు పౌష్టికాహారమా లేక ఆహార వ్యామోహమా? అనే అంశంపై జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. డెప్యూటీ డీఈవో కె.వేణుగోపాలరావు ప్రారంభించారు.

అల్జీమర్స్‌తో మరిచిపోతారు

వయస్సు పెరుగుతున్న కొద్ది మతిమరుపు సహజం. దీనినే అల్జీమర్స్ వ్యాధి అంటారు. గతంలో విదేశాల్లో మాత్రమే ఈ మతిమరుపు వ్యాధిబారిన పడే వారిసంఖ్య అధికంగా ఉండేది. ప్రస్తుతం మన దేశంలో కూడా బాధితుల సంఖ్య పెరిగిపోయింది.

- నేడు వరల్డ్ అల్జీమర్స్ డే
- ప్రతి ఏడాది పెరుగుతున్న బాధితులు
- ముందస్తు జాగ్రత్తలతో కట్టడి చేయవచ్చు



గుంటూరు మెడికల్: ఇంటి నుంచి బయలుదేరిన వ్యక్తి కొంతదూరం వెళ్లాక ఇంటి అడ్రస్ మర్చిపోవటం, తన పేరు కూడా రోగి మర్చిపోయే స్థితికి చేరుకోవటం ఈ జబ్బు లక్షణం. ఆరోగ్య సంస్థల నివేదిక ప్రకారం ప్రతి ఏడు సెకన్లకు ఒకరు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. సుమారు 8.8 మిలియన్ల మంది వ్యాధితో బాధపడుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. జబ్బు సోకిన వారికి సహాయకులుగా ఉండేవారికి అవగాహన కల్పించటం కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ 1994 నుంచి ఏటా సెప్టెంబర్ 21న అల్జీమర్స్ డే నిర్వహిస్తోంది.

ప్రతిరోజూ 50 మందికి వైద్యం..

అల్జీమర్స్ వ్యాధికి చికిత్స కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న 30 మంది మానసిక వైద్యనిపుణులు, 15 మంది న్యూరాలజిస్టులను రోగుల సహాయకులు సంప్రదిస్తున్నారు. ప్రతిరోజూ న్యూరాలజిస్టులు, మానసిక వ్యాధి నిపుణుల వద్ద సుమారు 50 మంది వరకు అల్జీమర్స్ వ్యాధి బాధితులు చికిత్స పొందుతున్నట్లు అంచనా.

రోజువారి పనులు మరిచిపోతారు

వ్యాధి గ్రస్తులు రోజు వారి కార్యక్రమాలు మర్చిపోతారు. స్నానం చేయటం, బ్రష్ చేయటం, టిఫిన్ తినటం కూడా మర్చిపోతారు. వస్తువులను ఎక్కడో పెట్టి ఆ విషయాన్ని మర్చిపోయి ఎవరో దొంగిలించినట్లుగా అనుమానించటం, చెప్పిన విషయాన్నే పదే పదే చెప్పటం, వస్తువుల పేర్లు మర్చిపోవటం, వాటిని ఏ విధంగా వినియోగించాలో, ఎందు నిమిత్తం వినియోగించాలో అనే అంశాలను మర్చిపోవటం రోగిలో కనిపిస్తాయి. ఇంటికి తాళాలు వేయటం, కూరలో ఉప్పు వేయటం, పాలల్లో తోడు వేయటం వంటివి మర్చిపోవటం వ్యాధి గ్రస్తుల్లో కనిపిస్తాయి.

వ్యాధి లక్షణాలు...

వయసు పెరిగే కొద్ది వచ్చే అల్జీమర్స్ వ్యాధి సోకిన వారు తమ పేరు మర్చిపోతారు. ఒకేచోట కూర్చుని వీడియోగేమ్స్, టీవీలు చూస్తూ ఉండటం, అతిగా మద్యం తాగడం, శారీరక, మానసిక వ్యాయామం లేకపోవటం, అధిక కొవ్వు ఉన్న మాంసం తినటం వలన ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. బంధువుల, కుటుంబ సభ్యుల పేర్లు మర్చిపోతారు. పేర్లు మర్చిపోవటంతో పాటుగా వారిని గుర్తించటం కూడా కష్టమే. ఈ వ్యాధి ఎక్కువగా 60 సంవత్సరాలు దాటిన వారిలో వస్తోంది. నేడు 45 ఏళ్ల వారిలో కూడా వ్యాధి లక్షణాలు కనిపించటం ఆందోళన కలిగిస్తోంది.

ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చు...



మానసిక ప్రవర్తనలో ఆకస్మాత్తుగా మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రత లోపించటం, అపాయింట్‌మెంట్స్ మర్చిపోవటం, జ్ఞాపకశక్తిని కోల్పోవటం వ్యాధిగ్రస్తుల్లో కనిపిస్తాయి. పసి పిల్లవాడికి ఏవిధంగా స్నానం చేయమని చెప్పాలో అదే విధంగా అల్జీమర్స్ వ్యాధి గ్రస్తులకు ప్రతి ఒక్క విషయం గుర్తుచేయాలి. ప్రాథమిక దశలోనే వ్యాధి లక్షణాలను గుర్తించి వైద్యం చేయటం ద్వారా వ్యాధిని నివారించవచ్చు.

– డాక్టర్ చక్కా శివరామకృష్ణ, సీనియర్ న్యూరాలజిస్ట్, గుంటూరు

నియంత్రణలో పెట్టవచ్చు



వంశపారంపర్యంగా వ్యాధి సోకే అవకాశం ఉంది. జ్ఞాపకశక్తిని పెంపొందించే సూడోకు, పజిల్స్‌ను చేయించటం, జంక్‌ఫుడ్, ఆల్కాహాల్‌కు దూరంగా ఉండటం, శారీరక వ్యాయామం చేయటం ద్వారా వ్యాధికి దూరంగా ఉండటంతో పాటు నియంత్రణలో పెట్టవచ్చు. కుటుంబ సభ్యుల సహకారం వ్యాధి బాధితులకు తప్పనిసరిగా అవసరం.

– డాక్టర్ ఐ.వి.ఎల్.నరసింహారావు, మానసిక వ్యాధి నిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు



అల్జీమర్స్ వ్యాధి గ్రస్తులకు జీజీహెచ్‌లో అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నాం. ఓపీ విభాగంలో ప్రతి రోజూ ఈ వైద్య సేవలు లభిస్తాయి. రోగుల కోసం ప్రత్యేకంగా మెమరీ క్లీనిక్‌ను ప్రారంభించాం. ప్రస్తుతం మానసిక వైద్య విభాగంలో ప్రతి రోజూ సుమారు 200 మంది వైద్య సేవలను పొందుతున్నారు. వారిలో ఎనిమిది మంది అల్జీమర్ వ్యాధి బాధితులే.

– డాక్టర్ వద్దాది వెంకటకిరణ్, జీజీహెచ్, మానసికవ్యాధుల నిపుణులు

ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని మణిపురం బ్రిడ్జి దిగువున ఉన్న నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్స్‌లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా స్యూయింగ్ మిషన్ ఆపరేటర్, ఏసీ ఫీల్డ్ టెక్నీషియన్, సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్ కోర్సుల్లో టెన్త్, ఆపైన విద్యార్హతలు ఉన్న నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసు గల నిరుద్యోగులైన యువతీ, యువకులు ఈనెల 30లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు తమ ప్రతినిధి ఎస్.సైదులు నాయక్‌ను 9533219919 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జెడ్పీలో కారుణ్య, బ్యాక్‌లాగ్ పోస్టుల కింద నియామకాలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా పరిషత్‌లో నలుగురికి కారుణ్య, బ్యాక్‌లాగ్ వేకెన్సీ కింద నియామకాలు కల్పిస్తూ బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సీఈఓ జె.మోహన్‌రావు నియామక పత్రాలు అందజేశారు. అభ్యర్థిని ఏ రూపవతిని జెడ్పీ కార్యాలయంలో నియమించగా, సీహెచ్ వసంత్ (చెరుకుపల్లి), డి.శ్రీనివాసరావు(రెంటచింతల), ఎం.సవిత (యడ్లపాడు)లోని మండల పరిషత్ కార్యాలయాల్లో ఆఫీస్ సబార్డినేట్లుగా నియమితులయ్యారు. అదే విధంగా బ్యాక్‌లాగ్ వేకెన్సీ కింద డి. రామకృష్ణకు వినుకొండలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియామం కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ ఏ సెక్షన్ ఏఓ హేమంత్, ఉద్యోగులు పాల్గొన్నారు.

2న విద్యార్థులకు చిత్రకళ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న విద్యార్థులకు చిత్రకళ పోటీల్ని నిర్వహిస్తున్నట్లు పల్నాడు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి తెలిపారు. కేంద్రం ఆవరణలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. సబ్ జూనియర్స్ విభాగంలో 3,4,5 తరగతుల విద్యార్థులు గాంధీ బొమ్మ, జూనియర్స్ విభాగంలో 6,7,8 తరగతుల విద్యార్థులు పచ్చదనం-పరిశుభ్రత, సీనియర్స్ విభాగంలో 9,10 తరగతుల విద్యార్థులు గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం అంశాలపై చిత్రాలు గీయాలని ఆయన తెలిపారు. నరసరావుపేట పట్టణం, మండలం, నకరికల్లు, రొంపిచర్ల మండలాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులు పోటీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. పోటీల్ని నిర్వహించేందుకు విశ్రాంత ఉపాధ్యాయుడు కట్టా కోటేశ్వరరావు కన్వీనర్‌గా కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (విజయవాడ) మేనేజింగ్ కమిటీ సభ్యుడు యు.వి. రామరాజు, గాంధీ స్మారకసమితి అధ్యక్షుడు ఈదర గోపీచంద్, చిత్రకారులు చిన్నా, నాగయ్య పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

డెప్యూటీ డైరెక్టర్ ఓబుల్ నాయుడు



గురజాల : విధి నిర్వహణలో అలసత్వం వద్దని డెప్యూటీ డైరెక్టర్ ఓబుల్ నాయుడు సూచించారు. స్థానిక బాలుర వసతి గృహంలో బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న 4వ తరగతి ఉద్యోగులైన వంట మనుషులు, కమాటీ, వాచ్‌మెన్‌లకు వర్కుషాపు నిర్వహించారు. విధులు, బాధ్యతలు, విద్యార్థులతో మెలిగే విధానంపై డెప్యూటీ డైరెక్టర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో సుజాత కుమారి, వార్డెన్లు పాల్గొన్నారు.

నకిలీ నోట్ల కేసులో పది మందికి రిమాండ్

నరసరావుపేట రూరల్: నకిలీ నోట్లు ఇస్తామని నమ్మబలికి ఓ వడ్డీ వ్యాపారి నుంచి రూ.50లక్షలు కాజేసిన కేసులో మొదటి అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్ బుధవారం పది మంది నిందితులకు రిమాండ్ విధించారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నల్లచెరువుకు చెందిన కె.గిరీష్‌కుమార్ వెండి, ఇత్తడి వస్తువుల్ని కుదువపెట్టుకొని వడ్డీకి డబ్బులిచ్చే వ్యాపారం చేస్తుంటాడు. అతడికి ఏ వీరబ్రహ్మాచారితో పరిచయం ఏర్పడింది. తనకు తెలిసిన హైదరాబాదుకు చెందిన పి.శ్రీనివాసరావు వద్ద నకిలీ నోట్లు ఉన్నాయని, అసలు నోట్లకు బదులుగా అధిక మొత్తంలో నకిలీ నోట్లు ఇస్తాడని గిరీష్‌కుమార్‌కు ఆశ చూపించాడు. రూ.50లక్షలిస్తే రూ.60లక్షల విలువైన నకిలీ రూ.2వేల నోట్లు ఇస్తాడని చెప్పాడు. కోటప్పకొండ వద్దకు డబ్బులు తీసుకొని రమ్మనమని వీరబ్రహ్మాచారి కోరిన మీదట గిరీష్‌కుమార్ రూ.50లక్షలు తీసుకొని రాగా, అతడ్ని బెదిరించి ఆ డబ్బులు తీసుకొని ఉడాయించారు. బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు ఈ కేసుతో మొత్తం 12మందికి సంబంధం ఉన్నట్లుగా నిర్ధారించి కేసు నమోదు చేశారు. అరెస్టు చేసిన వారిలో శ్రీనివాసరావు, వీరబ్రహ్మాచారి, గురజాలకు చెందిన మహమ్మద్‌రఫీ, నకరికల్లు మండలం నరసింగపాడుకు చెందిన భానుప్రకాష్, నరసరావుపేట కోటప్ప కొండ రోడ్డుకు చెందిన ఎం.వి. అనుజ్ఞ నాయుడు, రొంపిచర్ల మండలం ఎడ్వర్డుపేటకు చెందిన కె.నరేష్, శివాపురం తండాకు చెందిన ఎస్.వెంకటరావు, మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన కె.నరేంద్ర, కారంపూడికి చెందిన కె.వెంకటేష్ ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ.50లక్షలతో పాటు రెండు కార్లు సీజ్ చేశారు.

డ్రాప్ అవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: పాఠశాలలకు వెళ్లకుండా గుర్తించిన పిల్లలను తక్షణం స్కూల్స్‌లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి అధికారుల సమావేశం బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రాస్ ఎన్రోల్‌మెంట్ రేషియోకు సంబంధించి క్లస్టర్స్ వారీగా పూర్తి స్థాయి సర్వే నిర్వహించాలని కోరారు. చైల్డ్ ఇన్ఫోలో ఉన్న వివరాల ప్రకారం ఎడ్యుకేషన్ సర్వేలో వివరాలు సక్రమంగా ఉండేలా ఎంఈఓలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సర్వే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలందరికీ ఇళ్లకు సంబంధించి ఈ ఏడాది చివరి నాటికి 31,046 గృహాల నిర్మాణం పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి వారం సమీక్ష నిర్వహించి పురోగతిని గమనించాలని సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన అర్జీలు సంతృప్తికరంగా పరిష్కరించాలని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఈఓ శైలజ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాలు

గుంటూరు వెస్ట్: ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 1879 పోలింగ్ కేంద్రాలున్నాయని పేర్కొన్నారు. వీటిలో వివిధ కారణాలతో 265 పోలింగ్ కేంద్రాలు ప్రదేశం మార్పుకు, 227 పేరు మార్పుకు నూతనంగా మరో 5 ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. వీటిపై రాజకీయ పార్టీల అభిప్రాయాలు ఎప్పటికప్పుడు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో చంద్రశేఖరరావు, డెప్యూటీ కలెక్టర్ సుజాత, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

మహిళల సమగ్ర ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మెప్మా ఎండీ విజయలక్ష్మి



మాట్లాడుతున్న మెప్మా ఎండీ విజయలక్ష్మి

తాడేపల్లిరూరల్: మహిళల సమగ్ర ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా ప్రభుత్వ అడుగులు వేస్తూ మహిళలను సంఘాలుగా ఏర్పాటు చేసి వారికి రుణాలు అందిస్తున్నామని మెప్మా ఎండీ విజయలక్ష్మి అన్నారు. గుంటూరు జిల్లా ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో మెప్మా ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడే విధంగా వడ్డీలేని రుణాలతో పాటు పావలా వడ్డీకి రుణాలు అందజేసే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న 166 పట్టణాలలో మెప్మాలో పనిచేస్తున్న టీఎల్ఎఫ్‌లోని ఓబీ మరియు ఆర్‌పీ మెంబర్స్‌కు సంఘం యొక్క విశిష్టతను, సంఘంగా ఏర్పడితే ప్రభుత్వం ఎలా రుణాలు అందజేస్తుంది, ఎటువంటి రుణాలు ఇస్తుందన్న విషయాలను మహిళలకు వివరించాలని చెప్పారు. ప్రభుత్వం డ్వాక్రా సంఘాలలో సభ్యులుగా ఉన్నవారికి వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ అభయ హస్తం, వైఎస్సార్ సున్నా వడ్డీతో ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. రుణాలు తీసుకున్న వారు సకాలంలో బ్యాంకులకు రుణాలు చెల్లిస్తే అధిక మొత్తంలో ఆ సంఘానికి బ్యాంకులు రుణాలు ఇస్తాయని, వాటి ద్వారా మహిళలు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందవచ్చని వివరించారు. రాష్ట్రంలో కొన్ని పట్టణాల్లో మహిళలు మెప్మా ద్వారా రుణాలు పొంది లక్షల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, వారు సంయుక్తంగా ఆ వ్యాపారాలు ఎలా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వారు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులకు ప్రభుత్వం నుంచి మార్కెట్ చేసుకోవడానికి ఎటువంటి సహకారాలు అందిస్తున్నారన్న విషయాలను నిరంతరం సభ్యులతో చర్చించాలని ఆమె సూచించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే ఆ కుటుంబం ఎంతో బాగుంటుందని, వారి పిల్లల భవిష్యత్‌కు బాటలు వేస్తారని ఆమె అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పట్టణాల్లో మెప్మా ద్వారా రుణాలు తీసుకున్న మహిళలు చేస్తున్న వ్యాపారాల గురించి తమ అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెప్మా రాష్ట్ర కో ఆర్డినేటర్ రమేష్, మెప్మా స్టేట్ మేనేజర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

రోగులకు ఉత్తమ వైద్యం అందించడమే లక్ష్యం

పల్నాడు జిల్లా వైద్యశాఖాధికారి రంగారావు



సమావేశంలో జిల్లా వైద్యశాఖాధికారి

మాచర్ల: పట్టణానికి చెందిన వైద్యశాలకు ప్రతిరోజూ వందలాది మంది రోగులు వస్తుంటారని, వారందరికీ మంచి వైద్యాన్ని అందించి ఉత్తమ వైద్యశాలగా తీర్చిదిద్దడానికి వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని పల్నాడు జిల్లా ప్రభుత్వాసుపత్రుల సమన్వయ వైద్యశాఖాధికారి (డీసీహెచ్ఎస్) బి. రంగారావు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం సిబ్బందికి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడా రాజీపడకుండా వైద్యాన్ని ప్రతి ఒక్కరికీ అందించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశించిన లక్ష్యాల్ని చేరుకోవాలని చెప్పారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్య సౌకర్యాలు, 50 పడకల ఆసుపత్రికి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కృషి చేశారని తెలిపారు. వైద్యుల సంఖ్యతో పాటు సిబ్బంది పెరిగారని, దీనికనుగుణంగానే ప్రతి ఒక్కరూ రోగులకు సేవలందించడానికి కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఉదయభాను, వైద్యులు ఆర్. విజయలక్ష్మి, జయప్రకాష్, దినేష్, వంశీ, రేవతి, కె.పి.చారి, లావణ్య, ఆశీర్వాదం, మురళి పాల్గొన్నారు.



పతాకధారులుగా హర్మన్‌ప్రీత్ సింగ్, లవ్లీనా

ఆసియా క్రీడల ప్రారంభ వేడుకల్లో భారత బృందానికి పతాకధారులుగా పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మహిళా స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గోహైన్ వ్యవహరించనున్నారు. ఈనెల 23న చైనాలోని హాంగ్జూ నగరంలో ఆసియా క్రీడలకు తెర లేవనుంది. అస్సాంకు చెందిన 25 ఏళ్ల లవ్లీనా టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం, ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. పంజాబ్‌కు చెందిన హర్మన్ భారత్ తరఫున 191 మ్యాచ్‌లు ఆడి 155 గోల్స్ చేశాడు.

రష్మిక శుభారంభం



అంతర్జాతీయ మహిళల టెన్నిస్ (ఐటీఎఫ్) టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేసింది. సింగిల్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన ఆమె, డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పెర్త్‌లో జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో రష్మిక 6-3, 6-3తో జెస్సీ కులే (ఆస్ట్రేలియా)పై గెలిచింది. డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక (భారత్)-మోనిక్ బ్యారీ (న్యూజిలాండ్) ద్వయం 6-4, 7-6 (7/5)తో ఎలీనా మిసిచ్ (ఆస్ట్రేలియా)-మిచికా ఒజెకి (జపాన్) జంటను ఓడించింది.

భారత్ సంచలనం

వాలీబాల్‌లో కొరియాపై విజయం • ఆసియా క్రీడల్లో నాకౌట్ దశకు అర్హత



హాంగ్జూ (చైనా): మూడున్నర దశాబ్దాల పతక నిరీక్షణకు తెరదించాలనే లక్ష్యంతో ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన భారత పురుషుల వాలీబాల్ జట్టు తొలి అడ్డంకిని అధిగమించింది. గ్రూప్ 'సి'లో టాప్ ర్యాంక్‌లో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించింది. మంగళవారం కంబోడియా జట్టును ఓడించిన భారత జట్టు బుధవారం పెను సంచలనం సృష్టించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 27వ స్థానంలో ఉన్న దక్షిణ కొరియా జట్టును భారత్ బోల్తా కొట్టించింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో భారత జట్టు 25-27, 29-27, 25-22, 20-25, 17-15తో దక్షిణ కొరియాపై గెలిచింది. 1966 నుంచి ప్రతి ఆసియా క్రీడల్లో దక్షిణ కొరియా స్వర్ణ, రజత, కాంస్య పతకాల్లో ఏదో ఒక పతకం సాధిస్తూ వస్తోంది. భారత జట్టు చివరిసారి 1986 సియోల్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకం గెలిచింది. కొరియాతో 2 గంటల 38 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు సమష్టి ప్రదర్శన కనబరిచింది. ముఖ్యంగా అమిత్ అత్యధికంగా 24 పాయింట్లు స్కోరు చేశాడు. వినిత్ కుమార్, అశ్వల్ రాయ్ 19 పాయింట్ల చొప్పున సాధించారు. మనోజ్ ఎనిమిది పాయింట్లు, ఎరిన్ వర్గీస్ ఏడు పాయింట్లు అందించారు. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో కొరియా రజత పతకం నెగ్గగా, భారత్ 12వ స్థానంలో నిలిచింది.

రోయింగ్‌లో జోరు...

రోయింగ్‌లో భారత క్రీడాకారులు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. జస్విందర్ సింగ్, భీమ్ సింగ్, పునీత్ కుమార్, ఆశిష్‌లతో కూడిన భారత పురుషుల జట్టు కాక్స్‌లెస్ ఫోర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరింది. మహిళల కాక్స్‌డ్ ఎయిట్ ఈవెంట్‌లో అశ్వతి, మృణమయి సాల్గావ్‌కర్, ప్రియా దేవి, రుక్మిణి, సొనాలీ, రీతూ, వర్ష, తెన్‌దోన్‌తోయ్ సింగ్, గీతాంజలిలతో కూడిన భారత జట్టు కూడా ఫైనల్లోకి ప్రవేశించింది.

నేడు మలేసియాతో భారత మహిళల పోరు



మహిళల టి20 క్రికెట్‌లో భారత నేరుగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. మలేసియాతో నేడు జరిగే పోరులో స్మృతి మంధాన బృందం బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సెమీఫైనల్‌కు చేరడంతో పాటు పతకం రేసులో నిలుస్తుంది. ఉదయం గం. 6:30 నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

సిరాజ్ మళ్లీ నంబర్‌వన్

ఐసీసీ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి భారత పేసర్



దుబాయ్: ఆసియా కప్ ఫైనల్లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టిన భారత పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 694 పాయింట్లతో నంబర్‌వన్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు 9వ స్థానంలో ఉన్న ఈ హైదరాబాదీ ఏకంగా ఎనిమిది స్థానాలు మెరుగుపర్చుకొని అగ్రస్థానానికి చేరుకోవడం విశేషం. వన్డే ర్యాంకింగ్స్‌లో సిరాజ్ టాప్‌గా నిలవడం ఇది రెండోసారి. ఈ ఏడాది జనవరిలో నంబర్‌వన్‌గా నిలిచిన అతను రెండు నెలల తర్వాత ఆసీస్ పేసర్ జోష్ హాజల్‌వుడ్‌కు ఆ స్థానాన్ని కోల్పోయాడు. ఆసియా కప్ ఫైనల్లో 21 పరుగులకే 6 వికెట్లు తీసిన ప్రదర్శనతో ఇప్పుడు మళ్లీ శిఖరానికి చేరాడు. కెరీర్‌లో అత్యుత్తమ దశను చూస్తున్న సిరాజ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగ పోస్ట్ చేశాడు. కొంత కాలం క్రితం చనిపోయిన తన తండ్రిని గుర్తు చేసుకుంటూ 'మిస్ యు పాపా' అంటూ క్యాప్షన్ పెట్టాడు. తనను తల్లిదండ్రులు ఆశీర్వదిస్తున్న ఫోటోను వారిద్దరు చూస్తున్న చిత్రానికి తాను గ్రౌండ్‌లో ఆడుతున్న ఫోటోను అతను జత చేశాడు.

అమెరికాలోని మూడు నగరాల్లో...

టి20 ప్రపంచకప్ వేదికలు ఖరారు



దుబాయ్: వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌నకు సంబంధించి అమెరికాలోని మూడు వేదికల వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. న్యూయార్క్, డాలస్, ఫ్లోరిడా నగరాల్లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు జరుగుతాయి. బ్రోవార్డ్ కౌంటీ (ఫ్లోరిడా), గ్రాండ్ ప్రయరీ (డాలస్), ఐసన్ హోవర్ పార్క్ (న్యూయార్క్) స్టేడియాల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తామని ఐసీసీ పేర్కొంది. టి20 ప్రపంచకప్ అమెరికాలో జరగడం ఇదే మొదటిసారి. 2024 టోర్నీని వెస్టిండీస్‌తో కలిసి యూఎస్‌ఏ సంయుక్తంగా నిర్వహించనుంది. ఈ టోర్నీలో మొదటిసారి 20 జట్లు పాల్గొనబోతున్నాయి. ఇటీవలి వరకు ఈ టోర్నీని అమెరికాలో నిర్వహించడంపై సందేహాలు ఉన్నా ఐసీసీ తాజా ప్రకటనతో సందిగ్ధత తొలగింది. వచ్చే ఏడాది జూన్ 4-జూన్ 30 మధ్య టోర్నీ జరిగే అవకాశాలు ఉన్నాయి.

'నా అకౌంట్‌లో 80 వేలే ఉన్నాయి'

భారత నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగాల్ ఆవేదన



న్యూఢిల్లీ: అతను భారత నంబర్‌వన్ టెన్నిస్ ఆటగాడు... ఏడాది మొత్తం ప్రపంచవ్యాప్తంగా ఏటీపీ టోర్నీలలో పాల్గొంటున్నాడు. టోర్నీల్లో ప్రదర్శనకు ప్రైజ్‌మనీ కూడా దక్కుతుంది. మామూలుగా అయితే టెన్నిస్ ఆటగాళ్లు బాగా డబ్బున్నవాళ్లు అయి ఉంటారని, ఏ స్థాయిలో ఆడినా విలాసవంతమైన జీవితం ఉంటుందనిపిస్తుంది. కానీ ప్రపంచ టెన్నిస్‌లో వాస్తవ పరిస్థితి వేరు. అది ఎంత ఖరీదైందో... అగ్రశ్రేణి స్టార్లు తప్ప 100 కంటే ఎక్కువ ర్యాంక్ ఉన్న ఆటగాళ్ల స్థితి ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో చెప్పేందుకు ఇది చక్కటి ఉదాహరణ! భారత్‌కు చెందిన ప్రపంచ 159వ ర్యాంకర్ సుమీత్ నగాల్ ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాడు. తన బ్యాంక్ అకౌంట్‌లో ఇప్పుడు 900 యూరోలు (సుమారు రూ. 80 వేలు) మాత్రమే ఉన్నాయని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు ప్రైజ్‌మనీల ద్వారా వచ్చిన డబ్బు, ఐఓసీఎల్ కంపెనీ జీతం, మహా టెన్నిస్ ఫౌండేషన్ ఇచ్చే ఆర్థిక సహాయం మొత్తం టెన్నిస్‌లోనే పెడుతున్నానని, అయినా సరే పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉందని వెల్లడించాడు. డబ్బులు లేకపోవడంతో ఫిజియో కూడా లేకుండా ఒకే ఒక కోచ్‌తో తాను పోటీల్లో పాల్గొంటున్నానని అన్నాడు. టెన్నిస్ సర్క్యూట్‌లో నిలకడగా ఆడుతూ టాప్-100లో చేరాలంటే ఏడాదికి కనీసం రూ. 1 కోటి ఖర్చు అవుతుందని నగాల్ చెప్పాడు. 'కొన్నేళ్లుగా నిలకడగా ఆడుతూ భారత నంబర్‌వన్‌గా ఉన్నా నాకు కనీస మద్దతు కరువైంది. ప్రభుత్వం 'టాప్స్' పథకంలో నా పేరు చేర్చలేదు. డబ్బులు లేక జర్మనీలోనే టెన్నిస్ అకాడమీలో శిక్షణకు దూరమయ్యాను. నేను గాయపడి ఆటకు దూరమైనపుడు అసలు ఎవరూ నన్ను పట్టించుకోలేదు. రెండుసార్లు కోవిడ్ రావడంతో ర్యాంక్ పడిపోయింది. మన దేశంలో ఆర్థికంగా మద్దతు లభించడం చాలా కష్టం. నా వద్ద ఉన్న డబ్బంతా ఆటకే పెడుతున్నా. గత రెండేళ్లలో ఏమీ సంపాదించలేదు. నేనేమీ ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ఉండటం లేదు. అన్నీ కనీస అవసరాలే. ఏం చేయాలో అర్థం కావడం లేదు. పూర్తిగా చేతులెత్తేశాను' అని నగాల్ తన బాధను చెప్పుకున్నాడు.

పతకానికి విజయం దూరంలో...

- సెమీస్‌లో పోరాడి ఓడిన అంతిమ్
- నేడు కాంస్య పతక బౌట్‌లో గెలిస్తే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత
- తొలి రౌండ్‌లో ప్రపంచ చాంపియన్‌పై నెగ్గిన భారత రెజ్లర్


అంతిమ్ పంఘాల్

బెల్‌గ్రేడ్ (సెర్బియా): భారత రెజ్లింగ్ రైజింగ్ స్టార్ అంతిమ్ పంఘాల్ సీనియర్ స్థాయిలోనూ సత్తా చాటుకుంది. అండర్-20 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండేళ్లు స్వర్ణ పతకాలు నెగ్గిన తొలి భారతీయ రెజ్లర్‌గా చరిత్ర సృష్టించిన అంతిమ్... ప్రస్తుతం ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతక రేసులో నిలిచింది. సెమీఫైనల్లో అంతిమ్ 4-5 పాయింట్ల తేడాతో వనెసా కలాద్‌జిన్‌స్కాయా (బెలారస్) చేతిలో పోరాడి ఓడిపోయింది. నేడు జరిగే కాంస్య పతక బౌట్‌లో అంతిమ్ గెలిస్తే పతకంతోపాటు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ కూడా ఖరారవుతుంది. సోఫ్‌టీల్‌విరా ఒర్‌షుష్ (హంగేరి), ఎమ్మా జోనా డెనిస్ మాల్మ్‌గ్రెన్ (స్వీడన్) మధ్య బౌట్ విజేతతో కాంస్య పతకం పోరులో అంతిమ్ తలపడుతుంది. అంతకుముందు తొలి రౌండ్‌లో అంతిమ్ 3-2తో డిఫెండింగ్ చాంపియన్ డొమినిక్ ఒలివియా పారిష్ (అమెరికా)ను బోల్తా కొట్టించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో అంతిమ్ 10-0తో రొక్సానా మార్టా జసినా (పోలాండ్)పై, క్వార్టర్ ఫైనల్లో 9-6తో నటాలియా మలిషెవా (రష్యా)పై గెలుపొందింది. భారత్‌కే చెందిన మనీషా (62 కేజీలు), ప్రియాంక (68 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో, జ్యోతి బెర్వాల్ (72 కేజీలు) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. భారత రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో భారత రెజ్లర్లు యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) పతాకంపై, ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్ రెజ్లర్లు తటస్థ అథ్లెట్లుగా ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడుతున్నారు.

సినిమా

మళ్లీ జోడీగా...


• సాయి పల్లవి, నాగచైతన్య

హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయి పల్లవి మళ్లీ జోడీగా కనిపించనున్నారు. 'లవ్ స్టోరీ' (2021) వంటి సూపర్ హిట్ చిత్రం తర్వాత ఈ ఇద్దరూ 'ఎన్‌సీ 23'లో (వర్కింగ్ టైటిల్) మరోసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. చందు మొండేటి ఈ చిత్రానికి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సినిమాలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు బుధవారం మేకర్స్ ప్రకటించారు. ''వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కనున్న చిత్రమిది. నాగచైతన్య, చందు మొండేటి కెరీర్‌లో భారీ బడ్జెట్ చిత్రం అవుతుంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

తెలుగోడి జానపదం దమ్ము చూపించింది

- నిర్మాత 'బన్నీ' వాసు


• విద్య, శ్రీకాంత్, శివానీ, రాహుల్, 'బన్నీ' వాసు

''ఒక పాట హిట్ అయితే సక్సెస్ మీట్ చేయడం మాకు తెలిసి ఇదే తొలిసారి. మా 'కోట బొమ్మాళి పీఎస్' సినిమాలోని 'లింగి లింగి లింగిడి...' పాట తెలుగోడి జానపదం దమ్ము చూపించింది. ఈ పాటకి పి. రఘు సాహిత్యం అందించడంతో పాటు పాడారు'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, శ్రీకాంత్ మేక, వరలక్ష్మీ శరత్‌కుమార్ నటిస్తున్న చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజ మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్నారు. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగి లింగిడి...' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేశారు. ఈ పాటకి అద్భుతమైన స్పందన వస్తోందంటూ సక్సెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ– ''చాలా కాలం తర్వాత మంచి సినిమా చేశాననే అనుభూతి ఉంది'' అన్నారు. ''నా జీవితంలో గుర్తుండిపోయే పాట వచ్చినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు రాహుల్ విజయ్. ''ఈ పాట ఎంత పాపులర్ అయ్యిందో సినిమా కూడా అలాగే ఉంటుంది'' అన్నారు శివానీ రాజశేఖర్. ''నా సినిమాలో జానపదం పాట పెట్టాలనే కల ఈ చిత్రంతో నెరవేరింది'' అన్నారు తేజ మార్ని.

హిట్ అయినదే పెద్ద సినిమా

- శ్రీకాంత్


• 'రుద్రం కోట' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఓ దృశ్యం

''రుద్రం కోట' చిత్రం ట్రైలర్, పాటలు బాగున్నాయి. ఇప్పుడు ఏది హిట్ అయితే అదే పెద్ద సినిమా అవుతోంది. ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించి, కొత్తవారిని ప్రోత్సహించాలి'' అన్నారు నటుడు శ్రీకాంత్. రుద్ర హీరోగా, శక్తి, విభీష హీరోయిన్లుగా రాము కోన దర్శకత్వం వహించిన చిత్రం 'రుద్రం కోట'. నటి జయలలిత కీలక పాత్రలో నటించి, సమర్పించారు. అనిల్ ఆర్కా కండవల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న స్క్రీన్ మాక్స్ సంస్థ ద్వారా విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని శ్రీకాంత్, నటి రాశీ విడుదల చేశారు. రాశీ మాట్లాడుతూ– ''రుద్రం కోట' టీజర్, ట్రైలర్ బాగున్నాయి. సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''మా సినిమాను సపోర్ట్ చేస్తున్నవారికి కృతజ్ఞతలు'' అన్నారు జయలలిత. ''ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించి పెద్ద సినిమాగా చేస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు అనిల్ ఆర్కా.

నాగేశ్వరరావుగారు నట విశ్వవిద్యాలయం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


• విగ్రహావిష్కరణ చేస్తున్న వెంకయ్య నాయుడుతో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అక్కినేని వెంకట్, నాగార్జున

''తెలుగు సినీ రంగానికి ఎన్టీఆర్, ఏయన్నార్ రెండు కళ్లు అని ఎప్పుడూ చెబుతుంటాను. తన జీవితాన్ని ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుకోవడం నాగేశ్వరరావుగారిలోని గొప్పతనం. అమరశిల్పి జక్కన్న, విప్రనారాయణ, తెనాలి రామకృష్ణ, మహా కవి కాళిదాసు.. ఇలా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఎలాంటి సినిమాలో అయినా ఒదిగిపోయేవారు. నాగేశ్వరరావుగారు ఒక పెద్ద నటనా విశ్వవిద్యాలయం. ఈ రోజు పరిశ్రమలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ ఆ విశ్వ విద్యాలయంలో విద్యార్థిననుకుని, ఆ గుణగణాలను అందిపుచ్చుకుంటే భవిష్యత్‌కు మంచి ప్రణాళికలు వేసుకున్నట్లవుతుంది'' అన్నారు భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు. బుధవారం (సెప్టెంబరు 20) ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అక్కినేని నాగేశ్వరరావు విగ్రహాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించి, మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారు మహానటులు.. మహా మనిషి. సినిమా రంగంలో విలువలు పాటించిన వ్యక్తి నాగేశ్వరరావుగారు. అవతలివాళ్లు నేర్చుకోదగ్గ కొన్ని మంచి సంప్రదాయాలు, విలువల్లో ఆయన జీవించి, నటించి మనకు చూపించారు. ఆ మార్గంలో ప్రయాణిస్తే అదే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి. నాగేశ్వరరావుగారు పరిపూర్ణమైన జీవితాన్ని గడిపి, జీవిత చరమాంకంలోనూ నటిస్తూనే ఉన్నారు. కొంతమంది జీవిత కాలంలో జీవిస్తారు. జీవిత కాలం పూర్తయిన తర్వాత కూడా జీవించే మహానుభావులు కొందరు. వారిలో అక్కినేని నాగేశ్వరరావుగారు అగ్రగణ్యులు. ఆయన మంచి నటులే కాదు.. పరిణతి చెందిన గొప్ప ఆశావాది కూడా. ఆయన నాస్తికుడు. గొప్ప తాత్వికుడు. ఆయన పెద్దగా చదువుకోలేదని అంటారు. కానీ జీవితాలను చదివారు. జీవితంలో ఆయన పోరాటం చేశారు.. జీవితాన్ని ప్రేమించారు.. ఆస్వాదించారు. జీవితంలో నేర్చుకున్న దాన్ని ఆచరణలో పెట్టి చూపించారు'' అని అన్నారు.

యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ– ''1950 సమయంలో నాగేశ్వరరావుగారు సినిమాల్లో నటించడం ప్రారంభించాక, సొంతిల్లు కట్టుకోవడానికి ముందే మద్రాస్ విశ్వ విద్యాలయానికి పాతికవేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆ తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పాతిక వేలు ఇచ్చారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయానికి కూడా పాతిక వేలు విరాళం ఇచ్చారు. ఇవన్నీ ఒక ఎత్తైతే.. 1959లో లక్ష రూపాయల విరాళం ఇచ్చి గుడివాడ కళాశాలను నిలబెట్టారు. నాలాంటివారు ఎందరో చదువుకోగలిగారు. ఆ విధంగా ఆ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఓ విప్లవానికి ఆయన నాంది పలికారు'' అన్నారు.

డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ – ''అక్కినేని నాగేశ్వరరావుగారి కష్టం, కళల పట్ల ఆయనకు ఉన్న ప్రేమ ఆయన్ను ఓ లెజెండ్‌ని చేశాయి. యువ నటీనటులకు నాగార్జునగారు స్ఫూర్తి అని నా ఫ్రెండ్స్ సర్కిల్స్‌లో చెబుతుంటారు. నాగార్జునగారేమో తన తండ్రి చూపించిన మార్గంలో నడిచానని చెబుతుంటారు'' అన్నారు.

నాగార్జున మాట్లాడుతూ– ''ఎవరి విగ్రహాన్ని అయినా చూస్తే.. ఆయన ఓ మహానుభావుడు... ఆయన మనతో లేరనే భావన నా మనసులో చిన్నతనం నుంచే ముద్రపడింది. ఏ విగ్రహం చూసినా నాకు అదే అనిపించేది. అందుకే వెంకయ్యనాయుడుగారు ఆవిష్కరించేంతవరకూ నేను నాన్నగారి విగ్రహాన్ని చూడలేదు. చూడబుద్ధి కాలేదు. ఎందుకంటే నాన్నగారు మాతో లేరనే విషయాన్ని అంగీకరించాల్సి వస్తుందేమోనని... శిల్పి వినీత్ ఈ విగ్రహాన్ని అద్భుతంగా చెక్కాడు. నాన్నగారు అద్భుతమైన జీవితాన్ని జీవించారు. తరతరాలుగా గుర్తుపెట్టుకునే పాత్రలు చేసిన నటుడు. కోట్లమంది తెలుగు ప్రజలు, అభిమానులు ప్రేమించిన వ్యక్తి.. ఇలా వివిధ రకాలుగా నాన్నగారు అందరికీ తెలుసు. మాకు మాత్రం నాన్నగారు మా గుండెలను ప్రేమతో నింపిన వ్యక్తి. నన్ను, నా తోబుట్టువులను, మా పిల్లలను.. అందర్నీ చల్లగా చూసిన వ్యక్తి. మాకు మనసు బాగున్నా, బాగోలేకున్నా నాన్నగారి దగ్గరికి వెళ్లి కూర్చుంటే చాలు అన్నీ సర్దుకునేవి. అన్నపూర్ణ స్టూడియోస్ నాన్నగారికి నచ్చిన స్థలం. నచ్చిన చోట విగ్రహం పెడితే ప్రాణ ప్రతిష్ఠ చేసినట్లు అంటారు. సో.. ఆయన ప్రాణంతో మా దగ్గరే ఉన్నారని, ప్రాణంతో మా మధ్యనే నడుస్తున్నారని అనుకుంటున్నాము. నా ఆలోచనల్లోనే కాదు.. ప్రతి ఒక్కరి ఆలోచనల్లో నాన్నగారు ఎప్పటికీ జీవించే ఉంటారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వచ్చిన వారికి, ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి వచ్చిన నాన్నగారి అభిమానులకు ధన్యవాదాలు'' అన్నారు.


• అఖిల్ • నాగచైతన్య

నాగచైతన్య మాట్లాడుతూ– ''ఏయన్నార్‌గారంటే తెలుగు చిత్ర పరిశ్రమలో ఓ పెద్ద, ఓ గొప్ప నటుడు, క్లాసిక్ ఐకాన్‌గా పరిచయం. ఆయన చిత్రాలు, ఆయన చేసిన ప్రయోగాలు ప్రేరణ కలిగించే కేస్ స్టడీగా చాలా మంది ఫిల్మ్ స్కూల్స్‌లో చదువుతుంటారు. ఈ జాబితాలో నేనూ ఉన్నాను. తాతగారితో నేను కలిసి నటించడం నా అదృష్టం. మన పుట్టుక మన చేతిలో ఉండదు. అలాంటిది అక్కినేని నాగేశ్వరరావుగారి మనవడిగా పుట్టడం నా అదృష్టం'' అని అన్నారు.

తాత ఏయన్నార్‌కు అఖిల్ నివాళులర్పించారు.

ఏయన్నార్ పెద్ద కుమారుడు వెంకట్ అక్కినేని మాట్లాడుతూ– ''మనిషి ఎంత కీర్తి సంపాదించినా, ఎంత ధనం గడించినా తలగడ మీద తల పెట్టగానే నిద్రపోవడం అనే ఆస్తి, సౌకర్యం ఏ ధనం ఇవ్వలేదు. ఏయన్నార్‌గారు తలగడ మీద తల పెట్టగానే హాయిగా నిద్రపోయేవారు. 1974లో బైపాస్ సర్జరీ జరిగింది. సర్జరీ ముందు రోజు నర్సు నిద్రకోసం మాత్ర ఇస్తే తీసుకోలేదు. ఏ మాత్ర వేసుకోకుండానే హాయిగా నిద్రపోయారు. ఆ తర్వాత ఆయన జీవితం అందరికీ తెలిసిందే. నాకు మరుజన్మ అంటూ ఉంటే ఆయన సన్నిధిలోనే ఉండాలనుకుంటున్నాను. అన్నపూర్ణ సంస్థ, ఏయన్నార్ ఫిల్మ్ స్కూల్, కాలేజీ, ఆయన చిత్రాలు, ఫ్యాన్స్ తీపి గుర్తులు'' అన్నారు.

మోహన్‌బాబు మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారు ఒక గ్రంథం. ఆయన 'మరపురాని మనుషులు' సినిమాకు అసోసియేట్‌గా చేశాను. అన్నపూర్ణ సంస్థలో ఎన్నో సినిమాల్లో నటించాను'' అన్నారు.

బ్రహ్మానందం మాట్లాడుతూ– ''రైతు కుటుంబంలో పుట్టి అద్భుతమైన స్థితికి చేరుకున్న వ్యక్తి నాగేశ్వరరావుగారు. మహానట వృక్షం. కళాకారులకు గొప్ప వరం. స్వయంశిల్పి. స్నేహశీలి. అద్భుతమైన క్రమశిక్షణ కలిగిన వ్యక్తి'' అన్నారు.

ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ– ''ఓ వేడుకలో నాగేశ్వరరావుగారితో మాట్లాడే అవకాశం లభించింది. స్టార్ అయిన మీరు 'మిస్సమ్మ' సినిమాలో కమెడియన్‌గా ఎందుకు చేశారు? అని ఆయన్ను అడిగాను. 'దేవదాసు' తర్వాత అన్నీ తాగుబోతు పాత్రలే వస్తున్నాయని, ఇమేజ్ మార్చుకోకపోతే ఇబ్బందవుతుందేమోనని, ఆ పాత్రను తానే అడిగి మరీ చేశానని చెప్పారు. నాగేశ్వరరావుగారికి ఆయనపై ఆయనకు ఉన్న నమ్మకానికి నమస్కారం చేయాలనిపించింది'' అన్నారు.


• రామ్‌చరణ్, నమ్రత, మహేశ్ బాబు

జయసుధ మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారితో ఎక్కువ సినిమాలు చేయడం నా అదృష్టం. క్రమశిక్షణతో పాటు ఆయన దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకున్నాను'' అన్నారు.

ఏయన్నార్ కుమార్తె నాగ సుశీల మాట్లాడుతూ– ''అందరికీ పండగలు ఉంటాయి. కానీ మా అక్కినేని అభిమానులకు నాన్నగారి జయంతే పండగ. అభిమానుల ప్రోత్సాహం వల్లే ఈ కార్యక్రమం సాధ్యమైంది. అమ్మానాన్నలు మేం ఎప్పుడూ కలిసే ఉండాలని కోరుకునేవారు. అలా మేమందరం కలిసే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చేశాం'' అన్నారు.

సుశాంత్ మాట్లాడుతూ– ''తాతగారు తన జీవితంలో కృతజ్ఞతకు విలువ ఇచ్చేవారు. ఇండస్ట్రీలో తారాస్థాయికి ఎదిగిన ఆయనకు కళామతల్లికి తిరిగి ఇవ్వాలని ఉండేది. అన్నపూర్ణ స్టూడియోస్, అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్, ఏయన్నార్ నేషనల్ అవార్డు, అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా.. ఇలా ఎన్నో ఆయన కృతజ్ఞతలోంచి వచ్చిన ఆలోచనలే'' అన్నారు.

''నాగేశ్వరరావుగారి విగ్రహం పనులను నాకు అప్పగించిన అక్కినేని కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు. దాదాపు ఐదున్నర నెలలు వర్క్ చేశాం'' అన్నారు విగ్రహ రూపకర్త వినేష్ విజయన్.

ఈ కార్యక్రమంలో అమల, సుప్రియ, సుమంత్.. ఇలా అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్, జగపతిబాబు, శ్రీకాంత్, మంచు విష్ణు, నాని, నాజర్, అనుపమ్ ఖేర్, అల్లు అరవింద్, అశ్వినీదత్, సి. కల్యాణ్, కేఎల్ నారాయణ, 'దిల్' రాజు, చినబాబు, నాగవంశీ, బి. గోపాల్, వైవీఎస్ చౌదరి, పి. కిరణ్, గుణ్ణం గంగరాజు, విజయ చాముండేశ్వరి తదితరులు పాల్గొని, అక్కినేని నాగేశ్వరరావుకి నివాళులు అర్పించారు.